అమ్మగారితో భక్తుల అనుభవాలు - 1

ఆశ్రిత కల్పవృక్షము



అంకితము: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు

వాసుదేవుని సంకీర్తనముగాని, కథా సన్నివేశములుగాని వినుచు తన జీవితము ఏ పుణ్యాత్ముడు గడపునో, వాని ఆయువే నిజమైన ఆయువు. విష్ణు స్మరణ యందు విష్ణువుండును గనుక అది విష్ణువు జీవించిన ఆయుష్కాలము. మిగిలినవారి ఆయుర్దాయములను సూర్యోదయ సూర్యాస్తమయ రూపములుగా సూర్యుడు మోసముచేసి అపహరించును. - మాస్టర్ ఇ.కె.

శ్రీ భరద్వాజ మాస్టర్ సుబ్బరామయ్య గారితో వెంకయ్య స్వామి లీలలు ముద్రించి భక్తులకు ఇవ్వు. ఆ పుస్తకాలు ఎక్కడ చదువుతారో అక్కడంతా సత్సంగం చేసినట్లు అని చెప్పారు. సుబ్బరామయ్య సార్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి గురించే గాక ఎందరో మహనీయుల జీవిత చరిత్రాలు, లీలలు ముద్రించి భక్తులకు అందజేశారు. సాక్షాత్తు భగవంతుడైన శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పత్ని (గురుపత్ని) శ్రీ అలివేలు మంగ తాయారు గారి దివ్య లీలలు telegram అనే మొబైలు అప్లికేషన్ లో “సమర్థ సద్గురు శ్రీ భరద్వాజ మాస్టరుగారి లీలావైభవం” అనే చానెల్ లో వచ్చాయి. వాటిల్లో కొన్నింటిని ఇక్కడ సంకలనం చేసి మా సమయాన్ని సద్వినియోగం చేసుకుందామని, ఈ లీలలు చదివిన వారి సమయం సద్వినియోగం, పావనము అవుతుందనే ఉద్దేశ్యంతో పుస్తక రూపంలో ప్రచురిస్తున్నాము. - శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్

సేకరణ మరియు పర్యవేక్షణ: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

ప్రాప్తిస్థానము: శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

వెల: గురుపత్ని శ్రీ అలివేలు మంగ తాయారు గారి దివ్య లీలలు చదివి పులకించి తరించటమే!

శ్రీ దత్తాత్రేయస్వామి పరంపరలో శ్రీ సాయినాథుని తత్వాన్ని 'శ్రీ సాయి లీలామృతము' ద్వారా మానవాళికి పరిచయం చేసి, 'శ్రీ గురుచరిత్ర' ద్వారా గురువుని ఎలా సేవించాలో తెలిపి , సత్యాన్వేషణ ద్వారా ఆధ్యాత్మికత ఎలా సాధించాలో తెలిపే పలు గ్రంథాలను మనకు అందించిన వారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవులు. వారి అవతారకార్యములో పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగ తాయారుగారి - అంటే మన అమ్మగారి స్థానము ఎంతో విశిష్టమైనది.

అమ్మగారు, మాస్టర్ గారు - వీరిద్దరి వివాహము, సాక్షాత్తూ సమర్థ సద్గురువైన సాయినాథుడు, ఇతర ఉద్దండులైన మహాత్ములందరూ కలిసి నిర్వహించిన జగత్ కళ్యాణమే.

పూజ్యశ్రీ మాస్టర్ గారి అడుగుజాడలలో, మార్గదర్శకత్వంలో నడుస్తూ ఆయనకు ఉత్తమ శిష్యురాలైన పూజ్య శ్రీ అమ్మగారు మాస్టర్ గారి ప్రతిరూపమై నిలిచారు. ఆమె సాయి సంప్రదాయానికి, గృహస్థ జీవితానికి సమన్వయరూపమైన మార్గదర్శి, గురుమూర్తి.

ఎంతో నిగూఢమైన స్వభావం కలిగిన అమ్మగారి ఔన్నత్యం తెలుసుకోవడం చాలా కష్టం. ఆమెలోని సాటిలేని శరణాగతి, సేవా నిరతి, ధైర్యము, ఓర్పు, నిత్యనూతనత్వము, ఉత్సాహము, పరోపకారము, సృజనాత్మకత... సామాన్యులమైన మనలను అశ్చర్యచకితులను చేస్తాయి.

అయితే ఆమెలోని సంపన్నత్వంతో కూడిన సాధారణత్వము, ఆమె నిరాడంబరత మనలను భ్రమింపచేసి ఆమె ఔన్నత్యాన్ని మన స్మృతిపథం నుండి మరుగుపరుస్తాయి.

కానీ ఒక విషయం మనం స్మరించుకోవాలి. సమర్థ సద్గురువైన, దత్తవతారులైన పూజ్యశ్రీ మాస్టర్ గారి అవతారకార్యంలో ఆమె రెండవ పార్శ్వము. అందుకే మహాత్ములందరూ కలిసి ఆమెను ఆయనకు అర్థాంగిగా నిర్ణయించి, వివాహం జరిపించారు. శ్రీ సుధీంద్రబాబుగారు, గులాబ్ బాబా మొదలైన మహాత్ములందరూ ఆమెను మహాత్మురాలిగా ప్రశంసించారు. అంటే ఆమె ఔన్నత్యం మన ఊహకు అందనిది. ఆమె సన్నిధి అత్యంత పవిత్రమైనది.

పూజ్య శ్రీ అమ్మగారు మనకు ప్రత్యక్షముగా కనిపించేది చాలాచాలా అరుదు. కానీ వారు ఎంతో మంది భక్తులకు అనుభవాలను ప్రసాదిస్తూ సాయి, మాస్టర్, తామూ వేరు కాదని భక్తులకు నిరూపిస్తూ వున్నారు. ఎక్కడెక్కడ నుంచో వచ్చే భక్తులు చెప్పే అనుభవాలు వారి సన్నిధిలో ఉంటున్న మాకే చాలా ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలుగజేస్తున్నాయి.

వీటన్నిటిని మీ అందరితో పంచుకోవాలనే సదుద్దేశముతో ఈ ఛానల్ ని ప్రారంభించాము.

పూజ్య శ్రీ అమ్మగారి కరుణా కటాక్షములు మన అందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ అమ్మగారి 75వ జన్మ దినోత్సవము (2019 అక్టోబర్ 1 న) సందర్భముగా ఈ రోజు గురువారం నుంచి (22nd ఆగష్టు 2019 నుంచి) ప్రతిరోజూ ఒక అనుభవాన్ని మీ ముందు వుంచుతాము.

అమ్మగారితో అనుభవాలు

ఒంగోలు కి చెందిన శ్రీ జగదీష్ మురారి గారు

ఒకసారి కలలో నాకు పూజ్యశ్రీ అమ్మగారు ఒక మంత్రం చెప్పారు. దాంట్లో 3 పదాలున్నాయి . మెలకువ వచ్చాక ఒక పదమే గుర్తుంది. ఎంత ప్రయత్నించినా మిగిలినవి గుర్తు రాలేదు. అది నా భ్రమ అయివుంటుందా అనిపించింది .

కొన్నిరోజుల తరువాత నాగోల్ వెళ్లాను. బాబుగారిని కలిసి మాటల సందర్భంలో నా కల గురించి చెప్పాను. అదంతా పేపర్లో రాసి ఇవ్వమన్నారు. నేను కావాలనే నాకు గుర్తున్న మొదటి పదం రాయలేదు. ఎందుకంటే నా కల నిజమే అయితే నాకు గుర్తున్న మొదటి పదంతోనే మంత్రం మొదలవ్వాలని వ్రాయలేదు. 'నాకు ఒక కల వచ్చింది. అందులో మీరు నాకు ఒక మంత్రం చెప్పారు. కాని నేనది మర్చిపోయాను' అని మాత్రమే వ్రాసి ఇచ్చాను.

బాబుగారు నేను వ్రాసిచ్చిన ఆ పేపర్ లోపలికి తీసుకుని వెళ్లి తిరిగి తెచ్చి ఇచ్చారు. అది చూడగానే నా గుండె ఝుల్లుమంది. నాకు తెలిసిన మొదటి పదంతోటే మంత్రం వ్రాసిచ్చారు. అంతేకాదు. మొదటిపదం క్రింద గీత

గీశారు (underline) .అంటే' నీకు తెలిసున్న పదం సుమా !' అని!!!

ఇక అప్పటినుంచి నేను రోజు కొంత సమయం ఆ మంత్రం పఠించుకుంటున్నాను. అయితే ఆ మంత్రం ఇప్పటివరకు నన్నెలా అనుగ్రహించిందో , ఆ మంత్ర ప్రభావం ఎంతటిదో తెలిపే లీలలు కొన్ని పంచుకుంటాను .

1) ఒకసారి కొన్ని సమస్యలవల్ల అశాంతికి గురై పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సుల కోసం నాగోలు వెళ్లాను. నిలయం దగ్గర చాలాసేపు ఎదురుచూశాను గాని ఎవరూ కనిపించలేదు. కాసేపటికి ఎవరో బాబుగారు ఊర్లో లేరని చెప్పారు. వేదక్క కనపడితే బాగుండునని ఎదురుచూశాను. అదీ కుదరలేదు. ఇక నిలయం పక్కనే ఉన్న అరుగు మీద కూర్చుని పూజ్యశ్రీ అమ్మగారు ఇచ్చిన మంత్రం మననం చేయడం మొదలుపెట్టాను . '110 సార్లు మననం చేస్తాను', అనుకున్నాను. 8 లేక 10 సార్లు అవ్వగానే తలుపు తీసుకుని వేదక్క బయటికి వచ్చారు. మళ్ళీ గుండె ఝల్లుమంది. ఎందుకంటే మంత్రం ఫలించినందుకు! వేదక్కకి నా సమస్య విన్నవించుకుని, పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులు తీసుకుని ఆనందంతో తిరిగి వచ్చాను.

2) ఒకసారి బెంగుళూరు వెళ్లాను. అక్కడ చింతామణి అన్న ప్రదేశంలో 'హయత్ బాబా 'అనే మహాత్ములున్నారని తెలిసి వారి దర్శనానికి వెళ్లాను. అక్కడ వేలల్లో భక్తులుంటారట. ఆ రోజు కూడా చాలామంది వున్నారు. వాళ్ళన్నారు 'ఇక్కడ ఆయన దర్శనంకోసం చాలసేపు ఎదురుచూడాలి, ఒక్కోసారి 2 లేక 3 రోజులు కూడా పట్టొచ్చు' అని. ఆయన చిన్న సైకిల్ మీద తిరుగుతూ ఉంటారట. ఒకసారి బయటికి వెళితే ఎప్పుడు వస్తారో తెలియదట. సరేనని నేను ఎదురుచూస్తున్నాను .

సడెన్ గా నాకు పూజ్యశ్రీ అమ్మగారు ఇచ్చిన మంత్రం గుర్తొచ్చింది. పఠించడం మొదలు పెట్టాను . 23 సార్లు అవగానే బాబా సైకిలు మీద తిన్నగా వచ్చి నా ముందే బ్రేక్ వేశారు. నాకు మతిపోయినంత పనైంది. ఒక పక్క ఆయన, ఒక పక్క ఆ మంత్ర ప్రభావం !! "యే షెహర్ సే ఆయేరే!",అని "ఎక్కడినుంచి వచ్చావు?" , అని తెలుగులో అడిగారు. నేను "ఒంగోలు" అని చెప్పగానే , "ఓ ఒంగోల్!" అని, "అక్కడే వున్నారు కదా, మళ్ళీ

ఇక్కడికెందుకు?" అన్నారు. మీ ఆశీస్సుల కోసం అంటే , "అక్కడే వుంటే చాలు. అన్నీ అక్కడే దొరుకుతాయి!" అని, "ఏం తెచ్చావు?" అని అడిగారు. ఈ సంతోషంలో నేను తెచ్చినవి సమర్పించలేదు. పూలమాలలు, ఆకు, వక్క (ఆయనకి అందరూ అవే సమర్పిస్తారు) ఇచ్చాను. ఆకు, వక్క బాగా నమిలి ఉమ్మేసి, "ఆ! పోయిందిలే!" అన్నారు. పాదనమస్కారానికి అవకాశం ఇచ్చారు. నేను నమస్కారం చేసుకోబోతూ ఉండగా అక్కడివాళ్లు, "పాదాలు ముట్టుకోవద్దు" అన్నారు. వెంటనే ఆయన,"యే షెహెర్ సే ఆయేరే !" అని గట్టిగా చెప్పి నాకు ఆశీస్సులిచ్చి పంపించారు. అక్కడి వాళ్ళందరూ చుట్టుముట్టి ఎక్కడినుంచి వచ్చావని అడిగారు. పూజ్యశ్రీ అమ్మగారికి అక్కడినుంచే కృతజ్ఞతా పూర్వక నమస్కారములు తెలియచేసుకున్నాను.

3) నా శ్రీమతి ఈశ్వరికి డెలివరీ టైం. సడెన్ గా ప్లేట్లెట్స్ డౌన్ అయిపోయాయి. మా డాక్టర్ ఇక ఇక్కడ లాభం లేదు, హైదరాబాద్ తీసుకుని పొమ్మన్నారు. నాకేమి చెయ్యాలో తోచక అలాగే మాస్టర్ గారి సమాధి మందిరానికి వచ్చాను. నమస్కారం చేసుకుని బయటికి రాగానే ఒకతను కనబడి , "మన వాలంటీర్ వాళ్ళ అమ్మాయికి బాబు పుట్టాడు", అన్నాడు ."ఓహో సంతోషం!", అన్నాను .'ఆ అమ్మాయికి ప్లేట్ లెట్స్ డౌన్ అయిపోతే ఇక్కడే ఫలానా హాస్పిటల్లో ట్రీట్మెంట్ చేశారట' అని చెప్పాడు ! నేను వెంటనే ఈశ్వరిని తీసుకుని ఆ హాస్పిటల్ కి వెళ్లాను. డాక్టరు అన్నారు , "6 లేక 7 ప్లేట్లెట్స్ పాకెట్స్ ,1 లక్ష రూపాయలు, అంబులెన్సు రెడీ చేసుకోండి. ప్లేట్లెట్స్ వేరేచోట ఎక్కించాలి అవసరమైతే", అని చెప్పి , "ముందే చెప్తున్నాను, ఎవరో ఒకరే దక్కవచ్చు. ఈ అమ్మాయి కోమాలోకి కూడా వెళ్లిపోవచ్చు కనుక భగవంతుని మీద భారం వేసి నా ప్రయత్నం నేను చేస్తాను" అని చెప్పారు. మా వాళ్ళందరూ ఏడుపులు మొదలుపెట్టారు. వాళ్ళందరినీ అక్కడనుంచి పంపించేసి నేనొక్కడినే అక్కడ నిల్చొని పూజ్యశ్రీ మాస్టరుగారిని, అమ్మగారిని తలచుకుంటూ పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదించిన మంత్రాన్ని మననం చేస్తూ ఉన్నాను.

అయిదు నిముషాల్లో డాక్టరు వచ్చి "నీకు బాబు పుట్టాడు", అన్నారు. వెంటనే నేను," ఈశ్వరి?" అని అడిగాను. ఆమె మౌనంగా లోపలికి వెళ్ళిపోయి

రెండు నిముషాలలో బయటికి వచ్చి "అంబులెన్సుని పంపించెయ్. నీ డబ్బులు బ్యాంకులో వేసుకో! మీ ఆవిడకి అద్భుతంగా ప్లేట్ లెట్స్ రెండులక్షల డబ్బై వేలకి పెరిగాయి!", అని సంతోషంగా చెప్పారు.

ఆ తరువాత తెలిసిన విషయం--- ఆ డాక్టరు మన మాస్టరు గారి డివోటీ అట! ఆ హాస్పిటల్ శంకుస్థాపనకు , గృహప్రవేశానికి మనవాళ్లే అక్కడ శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర పారాయణలు చేశారట. అందుకే నాకు మాస్టరుగారు సమాధి మందిరం దగ్గర అలా సూచించారు అనిపించింది .

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లికి 'మంత్రదాత్రే నమః', 'ప్రాణదాత్రే నమః' అని వందన సహస్రాలు హృదయపూర్వకంగా సమర్పించుకుంటున్నాను .

ఈ రోజు ఒక భక్తురాలి అనుభవం !

మావారు ఒక ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నారు. పెద్ద ఉద్యోగమే. మేము శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర నిత్యపారాయణ చేస్తూ వుంటాము. హైదరాబాద్ లో పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధిలో జరిగే కార్యక్రమాలలోను, ఒంగోలులో జరిగే కార్యక్రమాలలోనూ పాల్గొంటూ ఉంటాము. ఒకసారి మావారి బాంక్ లో పెద్ద పలుకుబడి ఉన్న ఒక వ్యాపారస్తుడు కొంత డబ్బు డిపాజిట్ చేసాడు. అవి ఎక్కడ ఎలా మాయమయ్యాయో తెలియలేదు. ఆ ధనం తాలూకు కాగితాలు కూడా కనిపించలేదు. బ్యాంక్ నుంచి వెంటనే డబ్బు కావాలని ఫోన్లు వస్తున్నాయి. ఆ ధనం కోసం అన్ని బ్రాంచీలలో కూడా వెతికించారు. ఆచూకీ లేదు. ఇంట్లో నాలుగు రోజులపాటు నిశ్శబ్దం ఆవరించింది. పిల్లలు, నేను కూడా ఆయనని పలకరించడానికి భయపడ్డాము. నిమిషనిమిషానికి ఫోన్లు వస్తూనేవున్నాయి. ఒకటే ఆందోళన!ఈ కేసు సిబిఐ దాకా వెళ్ళింది. మా వారిని విచారణకు పిలిచారు. దాదాపు ఉద్యోగం పోయేటంతటి పరిస్థితి.

ఇక 'అమ్మా నీవే శరణం!' అంటూ పుజ్యశ్రీ అమ్మగారి దగ్గరకు వెళ్ళి మా పరిస్థితి విన్నవించుకున్నాము.అప్పుడు అమ్మగారు "ఈ అమ్మాయికి పెద్ద సమస్యే వచ్చింది!" అని కొంతసేపు ధ్యానం చేసి సమస్య పరిష్కరమయ్యేందుకు ఇలా చేయమన్నారు---

1) ఒంగోలులో శ్రీమాస్టరుగారి సమాధికి మేమిద్దరమూ 108 ప్రదక్షిణలు చేయాలి

2) 108 మందికి అన్నదానం చేయాలి

3) శిరిడి వెళ్ళి మూడురోజులు నిద్ర చేసి, నేను, మావారు ఎంత బరువు ఉంటే అన్ని సాయిలీలామృతగ్రంథాలు పంచాలి.

మేము వెంటనే ఒకదాని తరువాత ఒకటి అన్ని మ్రొక్కులు తీర్చేసుకున్నాము.

చాలా ఆశ్చర్యం!!! పూజ్యశ్రీ అమ్మగారికి సమస్య విన్నవించుకున్న వెంటనే మరునాడే, "ఇప్పుడు ఆ కాగితాలతో పని లేదు", అని ఫోన్ వచ్చింది! చాలా తక్కువ వ్యవధిలోనే సమస్య పరిష్కారం అయిపోయింది. ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారికి తెలియచేయగానే "పూజ్యశ్రీ మాస్టరుగారి దయవలన గొడ్డలితో అనుభవించవలసిన కర్మ గోటితో పోయింది! ", అన్నారు!

మాతృశ్రీ అమ్మగారు నా వంటి వారి సంసారాలు ఎన్ని నిలబెట్టారో ! ఆ తల్లికి ఏమి చేసి ఋణం తీర్చుకోగలము?

శ్రీమతి రాధ

1) ఒకసారి నేను అక్కల్కోటస్వామి చరిత్ర పారాయణ చేస్తున్నాను. అందులో స్వామి భక్తులందరికీ పాదనమస్కారానికి అవకాశం ఇస్తూవుంటే నాకనిపించింది --- 'మనం దత్తస్వరూపమైన పూజ్యశ్రీ అమ్మగారి దగ్గర వుంటున్నాము కదా! అలా మనకు కూడా అవకాశమిస్తే -- అంటే పాద పూజలాంటివి చేసుకునే అవకాశముంటే ఎంత బాగుంటుంది!' అనిపించింది. ఒక గురువారం పగటిపూట నిలయంలో పూజ్యశ్రీ అమ్మగారు దర్శనం ఇచ్చారు. అందరం నమస్కారాలు చేసుకుంటున్నాము. నా వంతు రాగానే "ఏంటి సంగతి?" అని నవ్వారు. తరువాత సాయంత్రం 5 గంటలకు నిలయానికి రమ్మని కబురు చేసారు. అలాగే వెళ్లాను. పూజ్యశ్రీ అమ్మగారు పాదపూజ చేసుకునే అవకాశమిచ్చి నన్ను అనుగ్రహించారు!

2) ఒకసారి మా చుట్టాలింటికి పెళ్ళికి వెళ్ళాము. మా అమ్మాయిని తోడు పెళ్లి కూతురిని చేసారు. సహజంగా బాగా అలంకరించారు. నాకు లోపల ఒకటే ఆందోళనగా వుంది దిష్టి తగులుతుందేమో అని! తద్వారా

ఆరోగ్యం పాడవుతుంది కదా! ఇదీ నా భయం.

పెళ్లివేడుక పూర్తయిన తరువాత తిరిగి ఇంటికి రాగానే నిలయం నుంచి గురుబంధువు ఒకావిడ మా ఇంటికి వచ్చి "మీ అమ్మాయిని సాయంత్రం నిలయానికి వచ్చి దిష్టిబొట్టు పెట్టించుకొమ్మని అమ్మగారు చెప్పమన్నారు", అని చెప్పి వెళ్లారు!!! ఆ తల్లికి ఆశ్చర్యానందాలతో కృతజ్ఞతలు తెలియచేసుకున్నాను.

3) నేను ఎన్నో సంవత్సరాలుగా స్త్రీలకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతున్నాను. ఎన్నో మందులు వాడాను కానీ ఉపయోగం లేదు. ఒకరోజు ఒక కల వచ్చింది. ఆ కలలో హోమియో మందులకు సంబంధించిన పుస్తకాలు పట్టుకుని రమ్మన్నారు పూజ్యశ్రీ అమ్మగారు. "ఒక పుస్తకంలో నీ ఇష్టమొచ్చిన పేజీ తియ్యి" అని చెప్పారు. నేనలాగే చేసాను. "ఏముంది అందులో?" అనడిగారు. "భగవంతుని దయ వలన తగ్గుతుంది", అని వ్రాసి వుందని చెప్పాను. "అయితే అలాగే జరుగుతుంది!"అని చెప్పారు. అంతటితో కల ముగిసింది. మర్నాటినుంచి ఆ బాధ తగ్గిపోయింది. తరువాత మా చిన్న పాప పుట్టింది.

4) ఒక ఏడాది డిసెంబరు 31వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు పూజ్యశ్రీ అమ్మగారు దర్శనం ఇచ్చారు. ఎప్పటిలాగా ఒక గంటసేపు మాత్రమే కాక మూడు గంటల వరకూ వున్నారు. పైగా ఎప్పటిలాగా గది మధ్యలో కాక, కొంతసేపటికి ఆ గది ద్వారబంధం దగ్గరకు వచ్చి అందరికీ కనబడాలంటూ దర్శనమిచ్చారు. కారణం బయట కూర్చున్న చాలామందికి లోపల ఉన్న అమ్మగారు కనిపించరు. అప్పుడు నాకనిపించింది -- 'ముక్కోటి ఏకాదశినాడు ఉత్తరద్వారాలు తెరిచి భగవంతుని దర్శనం చేయిస్తారు కదా! ఈరోజు పూజ్యశ్రీ అమ్మగారు అందరినీ అలాగే అనుగ్రహించారు' అని! మరునాడు పూజ్యశ్రీ అమ్మగారితో, "నిన్న నాకు అలా అనిపించిందమ్మా!" అంటే నవ్వి ఊరుకున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు, అమ్మగారు లక్ష్మీనారాయణ స్వరూపులని భావించుకుని హృదయపూర్వక నమస్కారములు సమర్పించుకున్నాను.

ఓం స్మృతిమాత్రప్రసన్నాయై నమః !

ఒక భక్తురాలు ఇలా తెలియచేస్తున్నారు

అమ్మ, నాన్న, ఇద్దరం అక్కాచెల్లెళ్లం -- ఇది మా కుటుంబం. దాదాపు 2001 సంవత్సరంలో మాకు కొన్ని సమస్యలు వచ్చాయి. మా చుట్టాలలో ఒకరు మాతో విభేదాలు పెట్టుకుని మమ్మల్ని చాలా ఇబ్బందులకు గురిచేసారు. ఒక అబ్బాయిని పంపించి మేము చూడని సమయంలో కొన్ని బెదిరింపు ఉత్తరాలను మా ఇంట్లో పడే లాగా విసిరేయించేవారు. అవి చాలా భయంకరంగా ఉండేవి. మేమిద్దరం అప్పటికి పెళ్లికాని ఆడపిల్లలం. ఆ ఉత్తరాలు మా పరువు ప్రతిష్టలకు ఇబ్బంది కలిగేలాగా ఉండేవి. ఇక మాకు ఏమి చెయ్యడానికి పాలుపోక, ఎవ్వరూ సహాయం చేసేవాళ్ళు కూడా లేకపోవడంతో మేము నిత్యం నమ్ముకునే బాబా, మాస్టర్ కాళ్ళనే పట్టుకున్నాము. రోజూ ఇంట్లో అందరమూ పారాయణలు, బాబా గుడిలో ప్రదక్షిణలు చేస్తూండేవారము. మాస్టరుగారిని క్షణం కూడా వదలకుండా ప్రార్ధించేవారము.

ఆ సమయంలో ఒక స్వప్నం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు, అమ్మగారు కలిసి దర్శనం ఇచ్చారు. నేను వెంటనే, "మాస్టరుగారండీ! .. " అంటూ మా సమస్య అంతా విన్నవించాను. పూజ్యశ్రీ మాస్టరుగారు అంతా విని, పూజ్యశ్రీ అమ్మగారిని చూపిస్తూ, "ఇక అన్నీ ఈమే చూసుకుంటారు. మీరు అన్నీ వీరికే చెప్పుకోండి!", అని చెప్పి అదృశ్యులయ్యారు. పూజ్యశ్రీ అమ్మగారి ముందు ఒత్తులు మాత్రం వేసి ఇంకా వెలిగించని పెద్ద దీపాల స్టాండ్ వుంది. పూజ్యశ్రీ అమ్మగారు నా వైపు తిరిగి, "ఎందుకమ్మా అంత భయపడతావు?", అంటూ కుర్చీలో నుంచి లేచి చేతితో అలా సుకుమారంగా ఒకసారి వూపారు. దీపాలన్నీ ఒక్కసారిగా వెలిగాయి. "ఇంతసేపట్లో పోతాయమ్మా మీ సమస్యలు!"అన్నారు. అంతటితో కల ముగిసింది.

మేము వెంటనే పూజ్యశ్రీ అమ్మగారికి ఒంగోలు వచ్చి కలుస్తామని ఫోన్ చేసాము. బహుశా అది 2002 సంవత్సరం. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు "నేను ఇప్పుడు హైదరాబాదులో వున్నాన"ని చెప్పారు. మేము వెంటనే అమ్మగారి దర్శనం కోసం బయలుదేరి హైదరాబాదులో చిక్కడపల్లికి వెళ్ళాము. ముందుగా మా సమస్య చెప్పి తరువాత నాకొచ్చిన కల కూడా

చెప్పి, "పూజ్యశ్రీ మాస్టరుగారు మిమ్మల్నే ఆశ్రయించమని చెప్పారు!" అనగానే చిన్నగా ఔనన్నట్లు తల వూపి, నాకు, అమ్మకు, అక్కకు పారాయణలు చెప్పారు. అందరికీ శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతంతో పాటు నాకు ప్రత్యేకంగా 'మహాత్ముల ముద్దుబిడ్డడు' పారాయణ వారానికి ఒకసారి అయ్యేలాగా చేయమని చెప్పి, వాళ్ళు మిమ్మల్ని ఏమీ చేయలేరు, భయపడకండి!" అని చెప్పారు.

మేము మా వూరు తిరిగి వచ్చాక, మమ్మల్ని భయపెట్టే అతను ఉత్తరాలు రాయకుండా ఊరికే రోజు ఇంటి దగ్గర కనపడేవాడు. కొన్నిరోజులకు కనపడకుండా పోయాడు. చాలారోజుల తరువాత మేమంతా ప్రశాంతంగా ఉన్నాము. అలా పూజ్యశ్రీ అమ్మగారు మా కుటుంబాన్ని కాపాడారు !!

ఓం సంకటనాశిన్యై నమః!!

ఒక భక్తురాలు ఇలా తెలియచేస్తున్నారు

నేను ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి ఇంటిలో జరిగే అన్ని కార్యక్రమాలకు వెళ్ళి సేవచేసుకుంటూ వుంటాను. మాకు ఇద్దరు అమ్మాయిలు.

మా పెద్దమ్మాయికి తెలిసినవాళ్ళని, మంచివాళ్ళని 18 ఏళ్ళ వయస్సులోనే పెళ్ళి చేసాము. కాని కుటుంబ కలహాలవల్ల ఆ అమ్మాయి కాల్చుకుని చనిపోయింది. ఈ కారణంగా రెండవ అమ్మాయికి పెళ్ళిచేయడానికి చాలా భయపడుతున్నాము. ఇదే విషయం పూజ్యశ్రీ అమ్మగారికి విన్నవించుకున్నాము.

"ఈసారి అట్లా ఏమీ జరగదు. ఆ పూచీ నాది! మీరేమీ భయపడకండి. మంచి అబ్బాయి, అందగాడు వస్తాడు. సంబంధాలు చూడండి," అని పూజ్యశ్రీ అమ్మగారు అభయమిచ్చారు. కొన్ని పారాయణలు చేయమని చెప్పారు. మూడురోజులకు ఒక పారాయణ పూర్తయ్యేలాగా శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతం పారాయణ చేస్తూ, పెళ్ళి ముందురోజు రాత్రి మొదలుపెట్టి తెల్లవారేసరికి పూర్తయ్యేలాగా శ్రీసాయిలీలామృతం పారాయణ

చేయమన్నారు. కొంతకాలానికి అనుకున్నట్లుగానే ఒక మంచి సంబంధం వచ్చింది. వాళ్ళకి మా అమ్మాయి నచ్చింది. కాని అదే రోజు మా చుట్టాలు ఒకరు వారి అమ్మాయిని చూడమని ఆ సంబంధం వారిని తీసుకువెళ్లారు. మాకు చాలా బాధ కలిగి మళ్ళీ పూజ్యశ్రీ అమ్మగారికి ఈ సంగతి చెప్పాము. "ఏమీ భయపడవద్దు. ఆ అబ్బాయి మీ అమ్మాయినే చేసుకుంటాడు" అని చెప్పారు. అదే విధంగా వాళ్ళు మా సంబంధమే ఖాయం చేసుకున్నారు.

పెళ్ళికొడుకు తండ్రికి ఆరోగ్యం బాగుండదు. పెళ్ళికి నాలుగు రోజులముందు ఆయనకు సీరియస్ అయింది. పూజ్యశ్రీ అమ్మగారి మీద భారం వేసి అనుకున్నట్లుగా ముందురోజు మొదలుపెట్టి తెల్లవారేసరికి పారాయణ పూర్తిచేశాను. పెళ్లి ఎటువంటి విఘ్నము లేకుండా జరిగిపోయింది. పూజ్యశ్రీ అమ్మగారి సూచనమేరకు నేను పెళ్ళిలో శ్రీసాయిలీలామృతాలు అందరికీ పంచాను. ఇంత దయ చూపించి మా జీవితాలను నిలబెట్టిన పూజ్యశ్రీ అమ్మగారికి జన్మజన్మలకూ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను !!

అభయదాయై నమః!

బాపట్లకు చెందిన శ్రీమతి కె. సరోజినిగారు

2017 వ సంవత్సరంలో ఫిబ్రవరి నెలలో ఒకనాటి రాత్రి నాకు ఒక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో అమ్మగారు దర్శనమిచ్చి ఒక బట్టల మూట నాకు ఇచ్చి, "నేను మీ ఇంటికి వస్తాను పదమ్మా!" అన్నారు. తర్వాత మా ఇంట్లోకి వచ్చి కుర్చీలో కూర్చున్నారు. అంతటితో కల ముగిసింది.

తర్వాత గురుదంపతుల కళ్యాణమహోత్సవం కోసం సత్సంగంలో అందరూ 'ఏ సేవను ఎవరు చేయాలి?' అని బాబా వద్ద చీట్లు వేస్తే అమ్మగారిని పెళ్ళికూతురుని చేసే మహద్భాగ్యం మాకు లభించింది. అమ్మగారు స్వప్నంలో తెలియజేసిన విధంగానే పెళ్లికూతురుగా ఉన్న పటం రూపంలో మా గృహానికి వచ్చి పావనం చేశారు.

మేము ఎంతో ఆశ్చర్యానందాలతో అమ్మగారిని స్వయంగా పెళ్లికూతుర్ని చేస్తున్నామన్న ఆనందంతో ఆ పటాన్ని అలంకరించి భక్తిశ్రద్ధలతో మేళతాళాలతో ఊరేగింపుగా కళ్యాణవేదిక వద్దకు చేరుకున్నాము. కళ్యాణం ఎంతో వైభవంగా జరిగింది. అందరూ

ఆనందోత్సాహాలతో కళ్యాణంలో పాల్గొన్నారు.

అనుగ్రహరూపాయై నమః!

నాగోలుకి చెందిన శ్రీమతి విశాలాక్షి గారు

ఒకరోజు విజయవాడలో ఉన్న మా తమ్ముడు ఫోన్ చేసి అమలాపురంలో వుంటున్న మా చెల్లెలికి ఆరోగ్యం బాగాలేదని, ఏదో గాలి సోకినట్లు ఉందని చెప్పాడు. ఆమె ఇంట్లో ఎప్పుడూ గొడవలతో సతమతమవుతూ వుంటుంది. అందువల్ల ఏదో ఆవేశంలో తీవ్రంగా ప్రవర్తిస్తే అందరూ అలా అనుకున్నారేమోనని భావించాను. వాళ్ళ ఇంట్లో ఆ గాలి పోవడానికి బాగా కొడుతున్నారని మళ్ళీ ఫోను వచ్చింది. ఇంట్లోవాళ్లు ఆమెపై కోపంతో అలా ప్రచారం చేసి కొడుతున్నారని అనుకున్నాను. మా తమ్ముడిని ఒకసారి వాళ్ళ ఇంటికి వెళ్లి చూసి రమ్మన్నాను.

అతను వెళ్లి ఆరోజు నాకు ఫోను చేశాడు. "నిజమే అక్కా! పరిస్థితి ఏమీ బాగా లేదు. నా ఎదురుగానే ఆకలేస్తోందని పెద్ద దిబ్బరొట్టె వేసుకుని ఒక్కతే తినేసింది! మళ్లీ ఆకలేస్తోంది, నీరసం అంటూ మళ్లీ ఏదైనా కావాలంటోంది. ఎవరినీ పెద్దగా పట్టించుకోవటం లేదు. రాత్రంతా గోల చేసి సతాయిస్తోంది. బావగారు చాలా ఇబ్బంది పడుతున్నారు" అని చెప్పాడు. ఆ మాటలు విని నాకు చాలా బాధ వేసింది.

వెంటనే అమ్మగారికి ఈ పరిస్థితి విన్నవించమని కబురుపెట్టాను. అప్పుడు అమ్మగారు విని ఆమెను వెంటనే నాగోలుకి తీసుకురమ్మన్నారు. నేను మా తమ్ముడికి ఫోన్ చేసి ఆమెను అక్కడినుంచి తీసుకుని నాగోలుకి రమ్మని చెప్పాను. అతను, "బావగారికి ఇక్కడ పనులున్నాయి. నేనొక్కడినే తీసుకురాలేను. ఆమెను ఒక్కరమే కదల్చడం చాలా కష్టం" అని చెప్పాడు. అప్పుడు మళ్లీ పరిస్థితి అమ్మగారికి విన్నవిస్తే నన్ను వెళ్ళి తీసుకురమ్మన్నారు. అంతేకాక 'ఎవరైతే పిశాచి రూపంలో ఆ అమ్మాయిని బాధ పెడుతున్నారో ఆ జీవికి ఉద్ధరణ, బాధపడుతున్న మా చెల్లెలికి స్వస్థత చేకూరాలి' అనే సంకల్పంతో నాగోలులో బయలుదేరిన దగ్గర్నుంచి తిరిగి వచ్చేదాకా నామస్మరణ, శ్రీగురుచరిత్ర పారాయణ చేయమన్నారు.

నేను ఇక్కడ నుంచి కారు మాట్లాడుకుని మాకు తెలిసిన ఇద్దరు

మగవారిని తీసుకుని వెళ్లాను. ఇది నాకు ఖచ్చితంగా అమ్మగారు ఇచ్చిన ధైర్యమే! 'పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలి?' అని బాధపడుతున్న నాకు, మనోధైర్యాన్ని ఇచ్చి పంపించారు అమ్మగారు. అంతేకాదు, ఆమెను నాగోలు తీసుకువచ్చాక ఇక్కడినుంచి గాణ్గాపూర్ తీసుకెళ్లమన్నారు .

మా చెల్లెలి ఇంటికి వెళ్లేసరికి పరిస్థితి చూస్తే చాలా బాధ కలిగింది. ఆమెకు 'మనవాళ్లు' అన్న భావమే లేదు. నేను, "పారాయణ చేసుకుంటున్నావా?" అని అడిగితే, "చదవాలనిపించడం లేదు!" అన్నది. నేను బలవంతంగా శ్రీ సాయిలీలామృతం గ్రంథం ఒడిలో పెట్టి చదవమంటే పక్కకు నెట్టేసింది. "సరే పద, డాక్టరుకి చూపిస్తాను" అంటే ఏదో బాటిల్ చూపించి, "ఇది తాగుతున్నాను లే, తగ్గుతుంది!" అన్నది. నేను బ్యాగులో బట్టలు సద్ది, " మా ఇంటికి బయలుదేరు!" అన్నాను. "నేను రాను, ఈయనకి పనులున్నాయి!" అన్నది. "పనులున్నా సరే, నువ్వు ఒక్కదానివైనా రావలసిందే!" అన్నాను. అప్పుడు తన ప్రతాపం చూపించింది! కళ్లు పెద్దవిగా చేసి ఒళ్ళు విరుచుకుంటూ, "నేనెక్కడికీ రాను" అని గట్టిగా అరుస్తోంది! నేను శ్రీగురుచరిత్ర పుస్తకం చేత్తో పట్టుకుని గట్టిగా గదమాయించాను. నాతో పాటు వచ్చిన వాళ్లు చెరొకవైపు పట్టుకుని కారు ఎక్కించారు.

నాతో పాటు వచ్చిన ఆయనదే ఆ కారు. ఆయన కారు నడుపుతున్నారు. ఇంకొకాయన, మా తమ్ముడు మా చెల్లెలిని మధ్యలో కూర్చోబెట్టుకున్నారు. నేను ముందు సీట్లో కూర్చుని శ్రీగురుచరిత్ర పెద్దగా పైకి చదువుతూ ఉన్నాను. ఉదయం 11 గంటలకు అమలాపురంలో బయలుదేరితే మధ్యాహ్నం 3.00 గంటలకు విజయవాడ చేరాము. అప్పటివరకూ ఎవరమూ మంచినీళ్లు కూడా తాగలేదు. దేనికైనా కారు దిగాలంటే భయం - ఆమె ఎక్కడ అరుపులు మొదలు పెడుతుందోనని! కారులోనే కంట్రోల్ చేయడం కష్టంగా ఉంది. ఇక హైదరాబాద్ దాకా ప్రయాణం చేయడం కష్టమనిపించింది.

అప్పుడు నాకొక ఆలోచన వచ్చింది. 'బయట ఎక్కడైనా దిగడం కష్టం కనుక పోలయ్యతాతగారి దగ్గర ఆగమంటారా?' అని ఫోన్ చేసి అమ్మగారిని అడగమన్నాను. అమ్మగారు పోలయ్య తాతగారి దగ్గర ఆగడానికి

అనుమతినిచ్చారు.

అక్కడ కూడా కారు దింపడం చాలా కష్టమయింది. పోలయ్యతాతగారు అటు తిరిగి కూర్చున్నారు. ఆమెను దింపలేక అందరమూ వదిలేశాము. అప్పుడు నాకు ఆలోచనలు మొదలయ్యాయి. 'ఇలాంటి మనిషిని తీసుకుని ఇంటికి వెళ్లి నేను ఎలా చూసుకోగలను? ఇంట్లో చిన్న పిల్లలున్నారు, ఎలా?' అని ఆలోచనలు వచ్చాయి. ఇక అమ్మగారి మీద భారంవేసి నమస్కరించుకుని స్థిమితపడ్డాను.

అక్కడ ఎంతో ఆకలిగా ఉన్న మాకు మేము కోరకుండానే భోజన ప్రసాదం పెట్టారు! మేము ఆశ్చర్యపోతుంటే తాతగారికి సేవ చేసే ఆయన ఒక విషయం చెప్పారు - "తాతగారు మాతో రోజూ వేసే బియ్యం కంటే రెండు కిలోలు ఎక్కువ వండించారు", అని చెప్పారు! అప్పుడు అర్థమైంది. మహాత్ములందరి సంకల్పం ఒక్కటే!

అక్కడ అమ్మగారి అనుమతి తీసుకునేసరికి ఇక్కడ మేము వస్తున్నట్లు తెలిసిపోయిందన్నమాట!

పోలయ్య తాతగారి ఆశీస్సులు తీసుకొని అక్కడి నుంచి బయలుదేరి నాగోలుకి వచ్చాము. అమ్మగారు మరునాడు గాణ్గాపూర్ కి ఆమెను తీసుకుని వెళ్ళమన్నారు. అక్కడకు వెళ్లిన మధ్యాహ్నం ఆమె వింతగా ప్రవర్తించింది. కాసేపటికి ఆమె కళ్లనుండి బాగా నీళ్లు కారాయి. ఆమె చేతులెత్తి దండం పెట్టింది. ఇక పరిస్థితి కుదుటపడింది. ఆమెకు ఆ పిశాచబాధ తీరిపోయింది. తిరిగి నాగోలుకు వచ్చి శ్రీ సాయిలీలామృతము సప్తాహ పారాయణ చేసుకున్నది.

మన అమ్మగారైన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆశీస్సులతో, సంపూర్ణ ఆరోగ్యవంతురాలై వాళ్ళింటికి సంతోషంగా వెళ్ళింది !!

పిశాచబాధానివారిణ్యై నమః!

బాపట్లకు చెందిన శ్రీ మందాడి మాల్యాద్రి గారు

మేము సుమారు 20 సంవత్సరాలనుండి బాపట్లలో సత్సంగాలు నిర్వహించుకుంటున్నాము. ఈ సత్సంగాలతో పాటు శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు వ్రాసిన 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథంనుండి కొన్ని లీలలను

సి.హెచ్.కోటేశ్వరావుగారు 'శ్రీ సాయి లీలామృతం' అనే నాటకంగా రూపొందించారు. కానీ నాలుగు సార్లు నాటకం వేసిన తర్వాత మాకు కొన్ని సందేహాలు కలిగి ఆ నాటకాన్ని ప్రదర్శించడం ఆపివేశాము.

ఆ తరువాత మన అమ్మగారైన పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి దర్శనార్థం 1998 ఆగస్టు నెలలో ఒంగోలుకు వెళ్ళాము. అక్కడ మేము అమ్మగారికి నాటకంలో మాకు కలిగిన సందేహాలను తెలియజేయగా అమ్మగారు వాటినన్నిటిని నివృత్తి చేసి, "ఈ నాటకము మాస్టరుగారికి కూడా ఇష్టమైనది కాబట్టి మీరు ఈ నాటకాన్ని ఆపకుండా కొనసాగించాలి!" అని మమ్మల్ని ప్రోత్సహించి, మాకు కొన్ని అమూల్యమైన సూచనలనందించారు. ఆ తరువాత పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరు గారి షష్టిపూర్తి మహోత్సవం సందర్భంగా 30-10-1998న ఒంగోలులోని మాస్టరుగారి ఇంటి వద్ద ఆరు బయట ప్రదేశములో 'శ్రీ సాయి లీలామృతం' నాటకం వేయమని ఆ ఉత్సవానికి మూడు నెలల ముందుగానే--అంటే ఆగస్టు నెలలోనే మమ్మల్ని ఆదేశించారు. మా ఆనందానికి, ఉత్సాహానికి అవధులు లేవు.

అమ్మగారు సూచించిన విధంగా నాటకంలో మార్పులు చేసి రిహార్సల్స్ చేసుకొన్నాము. 30-10-1998న బాగా మబ్బు పట్టి వర్షం కురుస్తున్నది. ఆ వర్షంలోనే బాపట్ల నుండి బయలుదేరి ఆ రోజు తెల్లవారుజామున ఒంగోలు చేరుకున్నాము. అక్కడ జరుగుతున్న మాస్టారుగారి షష్టిపూర్తి మహోత్సవ కార్యక్రమాన్ని ఎంతో ఆనందంగా తిలకించాము. ఆరు బయట వేదిక మొత్తం పూలతో అలంకరింపబడి వున్నప్పటికీ వర్షం కురుస్తునందు వలన ఆ ఉత్సవాన్ని పగలంతా మాస్టరుగారి ఇంటి మేడ మీదనే నిర్వహించడం జరిగింది.

మూడు నెలల క్రితం అమ్మగారు ఆ ఉత్సవంలో వారింటి ఆరు బయట ప్రదేశంలో నాటకం ప్రదర్శించమని చెప్పారు కదా! కానీ ఆ ప్రదేశంలో వర్షం కురుస్తున్నది గనుక ఆ రోజు సాయంత్రం అమ్మగారిని దర్శించుకుని, "అమ్మా! మమ్మల్ని ఈ నాటకం ఎక్కడ వెయ్యమంటారు?" అని అడిగాము. అప్పుడు అమ్మగారు, "నేను అప్పుడే చెప్పాను కదా, ఆరు బయట ప్రదేశంలో నాటకం వేయమని?" అన్నారు! మాకు అందరికీ ఎంతో ఆశ్చర్యం వేసింది.

ఎందుకంటే అప్పటికే అక్కడ కట్టిన వేదిక అంతా కురుస్తున్న వర్షం వలన తడిసి పోతున్నది. ఏదియేమైనప్పటికీ అమ్మగారు ఆదేశించారు కనుక అమె మీదే భారం వేసి వర్షంలోనే, ఆ తడుస్తున్న వేదిక మీదనే నాటకం వేయడానికి మేమంతా సిద్ధపడ్డాము. మేము అందరమూ నాటకంలో వేషాలు వేసుకుని అమ్మగారికి నమస్కారము చేసుకుని వేదిక ఎక్కి ప్రార్థన మొదలుపెట్టగానే కురుస్తున్న వర్షం అకస్మాత్తుగా ఆగిపోయింది!!! ఆశ్చర్యానందలతో మేము నాటకం వేసాము. నాటకం జరుగుతున్నంతసేపూ అమ్మగారు ఎదురుగా కూర్చుని నాటకం పూర్తిగా చూశారు. నాటకమంతా పూర్తికాగానే అందరినీ భోజనాలకు మేడ మీదకు వెళ్లమన్నారు. మేము వేషాలు తీయడం మొదలుపెట్టామో లేదో, వర్షం ప్రారంభమై కుండపోతగా కురిసింది!!! మేమంతా ఆ వర్షంలో తడుస్తూనే భోజనాలకు వెళ్ళవలసి వచ్చింది! అంటే నాటకం జరిగినంతసేపు మాత్రమే వర్షం కురవకుండా ఆగిందన్నమాట!! అది కేవలం అమ్మ గారి అనుగ్రహం కాక మరేమిటి?!

అమ్మగారు ప్రకృతి నియంత!

సర్వత్రస్థితాయై నమః!!

నెల్లూరుకి చెందిన శ్రీ కొత్తూరు శ్యాంప్రసాద్ గారు

1990వ సంవత్సరంలో నేను ఒంగోలులో పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లోనే వుండేవాడిని. ఆ సంవత్సరం పూజ్యశ్రీ మాస్టరుగారి కొత్త ఇంటి కట్టుబడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. లక్ష్మయ్య అనే అతను బాడుగకు ఇసుక తోలేవాడు. ఒకరోజు లక్ష్మయ్య నా దగ్గరకు వచ్చి, "అమ్మగారి దర్శనం కోసం చాలామంది భక్తులు వస్తున్నారు కదా! అమ్మగారు ప్రశ్న చెబుతారా?" అని ప్రశ్నించాడు. నేను, "పూజ్యశ్రీ అమ్మగారు గొప్ప మహాత్మురాలు. ఆమెకు నమస్కారం చేసుకొని మన బాధ మనసులో చెప్పుకొంటే చాలు, అది తీరిపోతుంది!", అని చెప్పాను. అతడు, "అయితే నేనూ నా బాధ చెప్పుకోవచ్చా?" అని అడిగాడు. "తప్పకుండా చెప్పుకోవచ్చు!" అన్నాను. లక్ష్మయ్య కాళ్ళు, చేతులు కడుగుకొని పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకుని నమస్కారం చేసుకొని వెళ్ళాడు.

రెండురోజులు అతను ఇసుక తోలడానికి రాలేదు. ఇసుక కోసం నేను

కర్నూలురోడ్డుకి వెళ్లి అతని గురించి విచారించాను. అక్కడివారు, "రెండురోజుల క్రితం లక్ష్మయ్య వాళ్ళ అబ్బాయిని కారు గుద్దింది. ఆ బాబు ఆసుపత్రిలో ఉన్నాడు. లక్ష్మయ్య వాళ్ళ అబ్బాయి దగ్గర వున్నాడు" అని చెప్పారు.

అంటే లక్షయ్య అమ్మగారికి నమస్కారం చేసుకొన్న మరురోజే వాళ్ళ అబ్బాయిని కారు గుద్దిందన్నమాట! అది విని నాకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. నేను గబగబా అమ్మగారి ఇంటికి చేరాను. నాలో అలజడి. 'నువ్వు చెప్పావు గాబట్టి అమ్మగారికి నమస్కారం చేసుకొంటే మా అబ్బాయికి ప్రమాదం జరిగింద'ని నన్ను ఎక్కడ నిలదీస్తాడో అని భయపడి, 'ఇంకెవ్వరికీ అలా చెప్పకూడదు!' అని నిర్ణయించుకున్నాను.

పది రోజులు గడిచాయి. ఒకరోజు నేను పూజ్యశ్రీ అమ్మగారి ఇంటి వరండాలో కూర్చొని వున్నాను. ఇంతలో గేటు తీసుకొని లక్ష్మయ్య వచ్చి నా దగ్గరగా కూర్చొన్నాడు. నాకు లోపల ఒక్కటే వణుకు.

నెమ్మదిగా, "ఎలా వున్నావు?" అని అడిగాను. అతను, "అయ్యా, అమ్మగారు చాలా గొప్పవారయ్యా!" అన్నాడు. అప్పుడు నా మనసు తేలిక పడింది. "ఏమి జరిగింది?" అన్నాను. అతను, "నేను అమ్మగారికి నమస్కారము చేసుకుని మా ఇంటి పరిస్థితి వివరించాను. నాకు వచ్చే ఆదాయంతో ఇల్లు గడపడం, మా అబ్బాయికి చదువు చెప్పించడం కష్టం. నేను పనికోసం బయటకు వస్తే వాడి ఆలనాపాలనా చూడడం చాలా ఇబ్బందిగా వుంది. 'అమ్మా నన్ను, నా కుటుంబాన్ని మీరే కాపాడండి!' అని మనసులోనే ప్రార్థించాను. మరుసటిరోజు మా అబ్బాయి బడికి వెళ్తూ రోడ్డు దాటుతుంటే కారు గుద్దింది. ఆ కారు యజమానులు మా అబ్బాయికి ఆసుపత్రిలో చికిత్స చేయించి, వాడి చదువుకు బ్యాంకులో డబ్బులు డిపాజిట్ చేశారు. అబ్బాయి ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బందీ లేదు. అమ్మగారు చాలా మహిమ గలవారయ్యా!" అన్నాడు. నా మనసంతా ఆనందంతో నిండిపోయింది.

అతనిలా హృదయపూర్వకంగా ప్రార్థన నేను ఎన్ని జన్మలకైనా చేయగలనా? పూజ్యశ్రీ అమ్మగారు దయచూపవలసిందే!!

శరణాగతవత్సలాయై నమః!

విజయవాడ నుంచి శ్రీ గుత్తి శ్రీనివాస్

చాలా సంవత్సరాల క్రితం అవధూత శ్రీ చివటం అమ్మ చరిత్ర కోసం ఆ గ్రంథ రచయిత్రి అయిన శ్రీమతి శారదా వివేక్ గారు కొన్ని విషయాలు సేకరించడానికి నన్ను చివటం పంపారు. అప్పుడు శ్రీ సుధీంద్రబాబుగారు భౌతిక శరీరంలో ఉండ్రాజవరంలో వున్నారు. శ్రీ చివటం అమ్మ చరిత్ర గురించిన కొన్ని విషయాలు కొందరు బయట ప్రపంచానికి తప్పుగా ప్రచారం చేస్తున్నారని మహనీయులైన శ్రీ సుధీంద్రబాబుగారు ఆగ్రహించి తీవ్రంగా మందలించారట. ఆ కారణంగా చివటంలో వున్న అమ్మ భక్తులు ఎవ్వరూ నాకు అమ్మ విషయాలు చెప్పడానికి సహకరించలేదు. చివరకు శ్రీ చివటం అమ్మకు సన్నిహితంగా వున్న శ్రీ లక్ష్మక్కగారు గాని, శ్రీ కట్టా సత్యం గారు కానీ, శ్రీ తేతలి బదరీనాథ్ గారు కూడా సహకరించటానికి శ్రీ సుధీంద్రబాబుగారు ఆగ్రహిస్తారనే భయం వ్యక్తం చేశారు. రెండు రోజులు తీవ్రంగా ప్రయత్నం చేశాను. కానీ ఫలితం శూన్యం. ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. ఇక ఆ పని నావల్ల కాదు అని నిర్ధారణయింది.

ఇక వేరు దారి లేక, దిక్కు తోచక మూడవరోజు ఉదయం ఒంగోలులోవున్న మాతృశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి ఫోన్ చేసి చివటంలోని పరిస్థితి అంతా వివరంగా చెప్పాను. ఇక మీరు అనుగ్రహిస్తే తప్ప శ్రీ చివటం అమ్మ చరిత్ర విషయ సేకరణకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం సాధ్యం కాదని మాతృశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి నివేదించాను.

అంతే!!

ఆశ్చర్యం!!

అలా పూజ్యశ్రీ అమ్మగారికి నివేదించానో లేదో, ఆ రోజు మధ్యాహ్నంనుంచే అందరూ సహకరించి చివటం అమ్మ చరిత్రలోని చాలా విషయాలలో వున్న సందేహాలను నివృత్తి చేశారు!! ఎన్నో విషయాలు స్పష్టంగా తెలిపారు. కొన్ని క్రొత్త విషయాలు చెప్పారు. నేను వచ్చిన పని చక్కగా పూర్తిచేయగలిగాను.

అంటే సంకల్పమాత్రంగా వారందరి హృదయాలను పూజ్యశ్రీ

అమ్మగారు మార్చివేసి శ్రీ చివటం అమ్మ చరిత్రకు సహకరించే సేవ నేను చక్కగా చేసుకోగలిగేలా అనుగ్రహించారు.

అది అమ్మగారి దయ, లీల!

విఘ్ననాశిన్యై నమః!

తణుకుకు చెందిన శ్రీ రాణి గోపాలకృష్ణగారు

1978-1979 మధ్యకాలంలో పూజ్యశ్రీ మాస్టరుగారు విద్యానగరులో వుండేవారు. ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు అమ్మగారిని, మరికొంతమందినీ విద్యానగర్ నుండి అవధూత శ్రీ చివటం అమ్మ, శ్రీ సుధీంద్రబాబుగార్ల దర్శనం కోసం తణుకుకు పంపారు. అవధూత శ్రీ చివటం అమ్మ దర్శనం చేసుకున్న తరువాత గొప్ప మహాత్ములైన శ్రీ సుధీంద్రబాబుగారి దర్శనానికి బయలుదేరాము. ఆ రోజు జరిగిన సంఘటన మరువరానిది, అమూల్యమైనది.

ఆరోజు పరమ పవిత్రమైన రోజు. ఇద్దరు మహాత్ములు ఒకేచోట కలిసిన రోజు. సుమారుగా ఉదయం 10 గంటల ప్రాంతంలో నేనూ, మాతృశ్రీ అలివేలుమంగమ్మగారు, ఆమెతో వచ్చినవారూ -- అందరం శ్రీ సుధీంద్రబాబుగారి దర్శనం కోసం వెళ్ళాము. ఆ రోజుల్లో శ్రీ బాబుగారు మేడ మీద వుండేవారు. మేము మెట్లు ఎక్కుతుండగా తలుపు తీసుకుని శ్రీ బాబుగారు బయటకు వచ్చారు. నన్ను చూసి "ఎవరు నాన్నా?" అన్నారు. పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ గారి శ్రీమతి , వారి విద్యార్థులు వచ్చారని చెప్పాను. అంతే, వెంటనే "ఒక్క ఐదు నిమిషాలు నాన్నా!" అని తన గదిలో వున్న వాళ్ళందరినీ పంపించేశారు. పూజ్యశ్రీ అమ్మగారిని "రండమ్మా, రండి!" అంటూ లోపలికి ఆహ్వానించారు. అక్కడున్న వారు అందరికీ కాఫీ ప్రసాదం ఇచ్చారు.

ఆ రోజు గ్రహణం విడుపు రోజు. ప్రయాణాలు చెయ్యరు. కానీ పూజ్యశ్రీ అమ్మగారూ వాళ్ళు ఆ రోజు మధ్యాహ్నం రైలుకి విద్యానగర్ వెళ్లిపోవాలి. టికెట్ల రిజర్వేషన్లు అయిపోయాయి. శ్రీ సుధీంద్రబాబుగారి దర్శనం ఒక అరగంటలో పూర్తిచేసుకుని ప్రయాణానికి బయలుదేరవచ్చని అందరమూ అనుకున్నాము.

శ్రీ సుధీంద్రబాబుగారిని దామోదర్ అనే విద్యార్థి, "బాబుగారూ!

గురువు అంటే ఎవరు?" అని ప్రశ్నించాడు. బాబుగారు అక్కడ వున్న అందరినీ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పమని అడిగారు. ఎవరూ పెదవి విప్పలేదు. ఆ తరువాత వారే, "లఘువు కానిది గురువు నాన్నా!" అన్నారు.

మామూలుగా స్త్రీలకు ఎక్కువసేపు దర్శనం ఇవ్వని శ్రీ బాబుగారు ఆ రోజు సాయంత్రం 5 గంటలవరకు దర్శనం అనుగ్రహించి మాకు అనందాన్ని పంచిపెట్టారు. అందరినీ నిండుగా ఆశీర్వదించారు. ప్రేమగా సాగనంపారు.

ఆ తరువాత ఆ ఇంటి యజమాని నన్ను అడిగారు--- "బాబుగారు ఆడవాళ్లకు ఇంతసేపు దర్శనం ఇవ్వరు కదా! మీతో వచ్చిన ఆమె ఎవరు?" అని. "ఆమె పూజ్యశ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారి శ్రీమతి!" అని చెప్పాను. "అందుకే ఇంతసేపు దర్శనమిచ్చారు. ఇది చాలా గొప్ప విషయం!" అని అన్నారు.

ఇంతలో రిజర్వేషన్ అయిన టికెట్స్ క్యాన్సిల్ చెయ్యడానికి నేను రైల్వేస్టేషనుకి వెళ్ళవలసివచ్చింది. పూజ్యశ్రీ అమ్మగారూ వాళ్ళు అక్కడే వున్నారు. ఆ సమయంలో శ్రీ బాబుగారు అవధూత శ్రీ చివటం అమ్మగారి గురించి ఎన్నో విషయాలు చెప్పారట. నాకు వినే అదృష్టం లేకపోయింది. మరుసటిరోజు పూజ్యశ్రీ అమ్మగారూ వాళ్ళు విద్యానగర్ వెళ్లిపోయారు.

కొద్దిరోజుల తరువాత శ్రీ సుధీంద్రబాబుగారు నన్ను అడిగారు "నాన్నా! వాళ్ళు క్షేమంగా చేరారా?" అని. "చేరారు బాబుగారూ, ఉత్తరం వచ్చింది!" అన్నాను. వెంటనే వారు, **"అమె గొప్ప మహాత్మురాలు నాన్నా!"** అన్నారు. అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారి గురించి ఎవ్వరికీ ఎక్కువగా తెలియదు. మొట్టమొదటిసారి పూజ్యశ్రీ అమ్మగారిని మహాత్మురాలిగా గుర్తించి లోకానికి తెలియజెప్పింది శ్రీ సుధీంద్రబాబుగారే! ఆయన అలా చెబుతుంటే వినే అదృష్టం నాకు కలిగింది. ఆ రోజు నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే రోజు, మరచిపోలేని రోజు.

ఆ సమర్ధసద్గురువైన సాయినాథుడు, ఆదిదంపతులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు, మాతృశ్రీ అలివేలుమంగమ్మ తల్లి మనలనందరినీ ఎల్లప్పుడూ ఆశీర్వదించుదురు గాక!

సత్పురుషవందితాయై నమః!

జడ్చెర్లలో వుంటున్న శ్రీమతి ఇందిరా పరమేశ్వరి

1) ఒకరోజు నేను పూజ్యశ్రీ అమ్మగారిని నా వివాహం గురించి పారాయణ చెప్పమని ప్రార్థించాను. ఆమె తరువాత చెబుతానన్నారు. అదే రోజు పూజ్యశ్రీ అమ్మగారు రాత్రి కలలో కనిపించి "నామం చేసుకో!" అని ఒక నామం చెప్పారు. నేను నా కల గురించి పూజ్యశ్రీ అమ్మగారికి విన్నవించలేదు. ఆ తరువాతి గురువారంనాడు పూజ్యశ్రీ అమ్మగారు నన్ను పిలిచి, "పారాయణ కాదు, నామం చెబుతాను. జపమాల తెచ్చుకొని జపం చేసుకో!" అని నామం చెప్పారు.

నేను నామం చేసుకోవడం మొదలుపెట్టిన మూడురోజులకే నాకు మంచి సంబంధం వచ్చి పెళ్లి కుదిరింది. నెల రోజులలోపలే వివాహం జరిగింది. అలా నాకొక జీవితాన్ని ఏర్పరచిన పూజ్యశ్రీ అమ్మగారికి ఎన్నిసార్లు నమస్కారం చేసుకున్నా తనివి తీరదు.

2) ఒకసారి నేను, రాధ, ప్రమీల, స్వామిజీ -- నలుగురమూ కలసి పోలయ్యస్వామి దర్శనానికి వెళ్ళాము. దర్శనానికి బయలుదేరేటప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగారికి నైవేద్యం పెట్టిన భోజనం, బెల్లం, పొగాకు మొదలైనవి మాకిచ్చి పంపారు.

మేము ఆయన దగ్గరకు వెళ్ళగానే శ్రీ పొలయ్య స్వామిగారు, "'ప్రసాదం పెట్టమ్మా!" అని రెండుసార్లు అడిగి పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రసాదం తీసుకున్నారు. ఆ రోజు శ్రీ పోలయ్యస్వామి చాలా ప్రశాంతంగా వున్నారు. స్వామి చాలా స్పష్టంగా, "ఇంత పప్పు వుంటే వేస్తావామ్మా? ", "ఇంత కూర వుంటే వేస్తావా? " అని అడిగి మరీ పెటించుకున్నారు. "అంత బెల్లం గడ్డ ఇస్తావమ్మా? " అని అడిగారు. వెంటనే బెల్లం ముక్క ఇస్తే తీసుకున్నారు. "ఇంత పొగాకు పెడతావామ్మా?" అన్నారు. మేము వెంటనే పొగాకును తుంచి చిన్న చిన్న ముక్కలు చేసిస్తే తీసుకున్నారు. కాసేపు తరువాత మళ్ళీ,"బువ్వ కావాలి!" అని అడిగి పూజ్యశ్రీ అమ్మగారు పంపిన ప్రసాదాన్ని రెండవసారి స్వీకరించారు. మమ్మల్ని చక్కగా ఆశీర్వదించి పంపారు.

3) ఒకరోజు నాకు తిరుచానూరు అలివేలు మంగమ్మ వారి దర్శనానికి

వెళ్లినట్లు స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో ఆ అమ్మవారు నాతో, "దక్షిణ కాదమ్మా, వస్త్రం పెట్టు!" అన్నారు. చాలారోజుల తరువాత నేను పూజ్యశ్రీ అమ్మగారి సేవలో వున్నప్పుడు నా కలను అమ్మగారికి విన్నవించి తిరుచానూరు శ్రీ అలివేలు మంగ స్వరూపంగా భావించి తమకు వస్త్రాలు సమర్పించుకుంటానని ప్రార్థించాను. పూజ్యశ్రీ అమ్మగారు నా ప్రార్థనను కరుణతో మన్నించారు. అట్టి పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లికి పాదాభివందనాలు.

4) నేను రెండు సంవత్సరాల పాటు తీవ్రమైన చర్మవ్యాధితో బాధపడ్డాను. ఆ వ్యాధి నివారణకు పూజ్యశ్రీ అమ్మగారిని పారాయణ చెప్పమని ప్రార్థించాను. దయతో ఆమె నాకు పారాయణ చెప్పారు. "ఏమీ బాధపడకు, తగ్గిపోతుంది. పారాయణ శ్రద్ధగా చేసుకో!" అని పూజ్యశ్రీ అమ్మగారు చెబుతుండేవారు. పారాయణ మొదలుపెట్టిన తరువాత కూడా ఆ వ్యాధితో సంవత్సరం బాధపడ్డాను. తరువాత చిత్రంగా ఒకరోజు నా వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. అది తగ్గిన రెండు రోజులకు నాకు పెళ్లి చూపులు జరిగాయి. తరువాత వివాహం జరిగింది.

పూజ్యశ్రీ అమ్మగారు చేసిన ఈ లీలను ఎప్పుడు తలచుకున్నా ఆశ్చర్యంగా, ఆనందంగా వుంటుంది. మనం చేసుకున్న పాపకర్మల వల్ల వచ్చే బాధలు, రోగాలు ఎప్పటి వరకు, ఎంత అనుభవింప చేయాలి అన్నది జగజ్జనని అయిన పూజ్యశ్రీ అమ్మగారికి తప్ప ఇంకెవరికి తెలుస్తుంది?

శరణాగతవత్సలాయై నమః!

హైదరాబాదులో వుంటున్న శ్రీ అజయ్ గారు

పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజగిరిలో వున్నప్పటినుంచి నేను దర్శనానికి వెళ్తుండేవాడిని. అయితే అప్పుడప్పుడు తప్ప తరచుగా దర్శనానికి వచ్చే వీలుండేది కాదు. ఈ 13 సంవత్సరాలలో పూజ్యశ్రీ అమ్మగారు తమ సలహాలు, సూచనల ద్వారా నా సమస్యలెన్నో పరిష్కరించడమే కాకుండా, నా జీవితానికి ఒక పెద్ద పెన్నిధిగా నిలిచారు! ఇప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి ప్రత్యక్షదర్శనం లేకపోయినా నాగోలులోని ఆమె నిలయంలో అడుగు పెడితే చాలు, మనసుకు హాయిగా వుండటమే కాక సమస్యలు కూడా

పరిష్కారమౌతున్నాయి. నేను పూజ్యశ్రీ అమ్మగారి ద్వారా పొందిన కొన్ని అనుభవాలను, ఆమె అనుగ్రహాన్నీ మీతో పంచుకుంటాను.

2005లో నేను ఒక చిన్న సంస్థలో పనిచేస్తూనే వేరే కంపెనీలలో మంచి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూండే వాడిని. కొంతకాలానికి ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. మూడు రోజులలో ఇంటర్వ్యూ వున్నదనగా నేను పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళాను. ఆమెకు ఆ విషయం వివరించి అనుగ్రహించమని వేడుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు శ్రీగురుచరిత్ర, శ్రీసాయిలీలామృతం ఆ మూడురోజుల్లో పూర్తయేలాగా పారాయణ చేయమన్నారు. నాకు ఒక్కసారిగా భయమేసింది. రోజూ ఉద్యోగానికి వెళ్ళాలి. ఇంటర్వ్యూకి వేరే ఊరికి వెళ్ళాలి. ఒక రాత్రి అంతా ప్రయాణం చెయ్యాలి. కనుక పారాయణ పూర్తిచేయడానికి సమయం సరిపోతుందో లేదోనని సందేహిస్తూ మౌనంగా నిలబడ్డాను. ఈ విషయం పూజ్యశ్రీ అమ్మగారు గ్రహించి, "మంచి ఉద్యోగం రావాలంటే పారాయణ చెయ్యాలిగా మరి!" అన్నారు. "సరేనమ్మా!" అని చెప్పి ఎంతో కష్టపడి శ్రీగురుచరిత్ర పారాయణ పూర్తిచేసాను. ఇంకా శ్రీసాయిలీలామృతం కొంచెం మిగిలేవుంది. దానిని పూర్తిచేయ్యనేలేదు. కానీ కేవలం పూజ్యశ్రీ అమ్మగారి కరుణ వలన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాను. అదే సమయంలో BSNLలో కూడా సెలెక్ట్ అయ్యాను. చివరికి BSNLలో స్థిరపడ్డాను. ప్రస్తుతం BSNLలో మనుగడ ప్రశ్నార్థకంగా వున్నది. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పినట్లు పారాయణ పూర్తి చేసి వుంటే ఆ పెద్ద కంపెనీలో చేరి వుండేవాడినేమో!

పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో వివాహం చేసుకున్నాను. మేము కొన్నాళ్ళు ఖమ్మంలో వున్నాము. అక్కడ మేమున్న ఇల్లు ఏ మాత్రం మాకు సరిపడలేదు. ఏవేవో సమస్యలుండేవి. ఎన్నో ఇళ్లు చూశాము, ఏదీ కుదరలేదు. అప్పుడు హైదరాబాదుకు వచ్చి పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్ళాను. మర్నాడే మూడు ఇళ్లు మంచివి దొరికాయి. ఒకదాంట్లోకి మారాము. అది కేవలం పూజ్యశ్రీ అమ్మగారి దయ అని గ్రహించాను. నేను పాత ఇంట్లో ఎదుర్కున్న సమస్యలకి, పూజ్యశ్రీ అమ్మగారి దర్శన మాత్రం చేత జరిగిన ఈ మార్పు మాకు ఎంతో ఊరట కలిగించింది. అది నేను మాటలలో చెప్పలేను.

మాకు బాబు పుట్టిన మూడున్నర సంవత్సరాల వరకు వాడికి మాటలు రాలేదు. ఎన్నో ప్రయత్నాలు చేసాము. పూజ్యశ్రీ అమ్మగారికి ఈ సమస్య విన్నవించుకున్నాను. తరువాత కొన్నిరోజులకే మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇంతకన్నా అనుగ్రహం ఇంకేముంటుంది? పూజ్యశ్రీ అమ్మగారు నా పాలిటి కల్పవృక్షం!!

ఒకసారి నాకొక స్వప్నం వచ్చింది. అందులో నేను, "అమ్మా! నాకు రెండు రోజులు సేవ చేసుకోవాలని వుంది," అని ప్రార్థించాను. పూజ్యశ్రీ అమ్మగారు అంగీకరించారు. మెలకువ వచ్చాక నవ్వుకున్నాను. 'మనసులో లోపల ఎక్కడో కోరిక వుండి వుంటుంది, అది స్వప్నంలో ఇలా బయట పడిందేమో! నాకెక్కడ సేవ దొరుకుతుంది? నేనేలా చేసుకోగలను?' అనుకున్నాను. ఆశ్చర్యం! కలలోని ప్రార్థనను పూజ్యశ్రీ అమ్మగారు ఇలలో నిజం చేశారు! మేము ఒకసారి శిరిడి వెళ్ళాము. అనుకోకుండా అక్కడ శ్రీమంగభరద్వాజ అన్నదాన సేవా సంస్థలో రెండు రోజుల పాటు సేవ చేసుకోగలిగాము. అంతేకాదు, ఆ రోజు అక్కడ అన్నదానం కోసం కొత్త పొయ్యిలు మొదలు పెట్టే రోజు. పొయ్యిని వెలిగించి ప్రారంభించే అవకాశాన్ని మా దంపతులకు ప్రసాదించారు పూజ్యశ్రీ అమ్మగారు. వేదక్క ద్వారా ఎలా చేయాలో మాకు చెప్పించి చేయించారు. ఇలాంటి సేవ నాకు ప్రసాదిస్తారని కలలో కూడా ఊహించనేలేదు! కానీ కలలోని ప్రార్థనను ఇలలో నిజం చేసిన మాతృశ్రీ అలివేలు మంగమ్మ తల్లి కృపకు ఎన్నివేల నమస్కారాలు సమర్పించుకోగలను?

ఇలా ఇప్పటిదాకా, ఇక ఎప్పటికీ ఆ తల్లి అండదండలతో, అనుగ్రహంతో మా జీవితాలు కొనసాగాలని మనసారా ప్రార్థిస్తూ పూజ్యశ్రీ అమ్మగారి పాదపద్మాలకు కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు సమర్పించుకుంటున్నాను.

వరదాయై నమః!

మా ఇతర ప్రచురణలు

క్ర.సం	పుస్తకము పేరు	ధర
	స్వామిని గురించిన పుస్తకములు	
1	అవధూత లీల ,తెలుగు	40
2	అవధూత లీల, తెలుగు బైండింగ్	80
3	అవధూత లీల తమిళ్ పెద్దవి	60
4	అవధూత లీల ఇంగ్లీషు పెద్దది	30
5	శ్రీ వెంకయ్య స్వామి, హిందీ	5
6	స్వామి సన్నిధి	15
7	అవధూత బోధామృతాము	15
8	చూచి నేర్చుకో	15
9	గురుస్తుతి	10
10	బాలల వెంకయ్యస్వామి	35
11	అవధూత లీల CD	20
12	శ్రీ వెంకయ్యస్వామి, eng చిన్నది	5
13	స్వామి కృప తమిళ్ చిన్నవి	5
14	స్వామి కృప తెలుగు	5
15	పిలిచిన పలికే దైవం	5
16	వెన్నెల పూలు	5
17	మౌన బోధ	5
18	బోధ యజ్ఞాయనమః	5
19	ధర్మ మూర్తి	5
20	దివ్య లీలలు	5
21	వాళ్ళు ఉండే దాన్ని బట్టి మన ముండేది	5
22	స్మృతి రహిత ప్రసన్నాయ నమః	5
23	స్మృతి మాత్ర ప్రసన్నాయ నమః	5
24	స్వామి అనుగ్రహము	5
25	సర్వ సమర్థుడు	5
26	నమ్మలేని పచ్చి సత్యాలు	5
27	నమ్మిన వారికి సొమ్ము నమ్మని వారికి దుమ్ము	5
28	శ్రీ వెంకయ్య స్వామి పూజ	5
29	వెంకయ్య స్వామి ఆరతులు	10
30	భజన	1
31	అసాధ్యము-సుసాధ్యము	5
	అద్వితీయ పుస్తకము	
32	వార్తాలాపము	250

క్ర.సం	పుస్తకము పేరు	ధర
	ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్ గురించిన పుస్తకములు	
33	శ్రీసాయి మాస్టర్ బోధామృతాము	50
34	అమృత వాక్కులు	5
35	మృత్యువుపై ఘనవిజయము	5
36	శుద్ధ చైతన్య మూర్తి	5
37	శ్రీ భరద్వాజ భక్తుల అనుభవాలు	5
38	మన ధర్మము కర్తవ్యము	5
	సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహరాజ్ (గొలగమూడి) గురించిన పుస్తకములు	
39	సార్ లేఖలు -1	15
40	సార్ లేఖలు-2	25
41	శ్రద్ధ	5
42	శ్రమతో సేవ-సేవతో కైవల్యం	5
43	పరోపకారార్థ మిదం శరీరం	5
44	శ్రీ సుబ్బరామయ్య మహారాజు భక్తుల అనుభవాలు	25
	మహనీయుల గురించి	
45	ధునివాలా దాదా	10
46	సాయి కృప	5
47	దైవం మానుష రూపేణ (పెద్దది(	60
48	దైవం మానుష రూపేణ(దర్గా స్వామి)	5
49	యర్ర దుర్గా స్వామి	5
50	రంగన్న బాబు	10
51	నల్ల మస్తాన్ బాబా	5
52	అవధూతేంద్ర స్వామి	5
53	నరోపా జీవితం చరిత్ర	5
54	పూండి స్వామి	5
55	నాంపల్లి బాబా (హైదరాబాద్)	10
56	మాయి అమ్మ (సేలం)	5
57	శివనేశన్ స్వామి (షిర్డి)	10
58	శివుని ఆజ్ఞ (శ్రీ వెంకటేశ్వర స్వామి)	10
59	కంచి పరమాచార్య	30
60	సుధీంద్ర బాబు	5
61	నామ కోటి(ఓం నారాయణ, ఆది నారాయణ)	20